సాక్షి
కాకినాడ
గురువారం । 10 ఏప్రిల్ । 2025




ఏమీ బాగోలేదు స్వామీ..
అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం.. భక్తులకు అందిస్తున్న సేవలకు సంబంధించి మూడో నెల అభిప్రాయ సేకరణలో కూడా మెరుగుదల కనిపించలేదు.

8లో



270 కేజీల గంజాయి స్వాధీనం
జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న గంజాయిని ముందస్తు సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు.

డెల్టాలకు 8,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

సీటీఎస్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏఐటీటీ–25 అండర్ సీటీఎస్ పరీక్ష రాయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే వర్మ బుధవారం తెలిపారు. 12వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 97012 15511 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి..

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో అర్హతగల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారిణి ఎం లల్లీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సొంత జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కులధ్రువీకరణ పత్రం, టెట్ పరీక్షలో అర్హత సాధించి రుజువు వంటివి జతపరచాలన్నారు. దరఖాస్తును వెనుకబడిన తరగతుల సంక్షేమం అండ్ సాధికారత అధికారి కార్యాలయం, 2వ అంతస్తు, ప్రగతి భవన్, డీఆర్‌డీఏ కాంప్లెక్స్, కాకినాడ చిరునామాలో సమర్పించాలని ఆయన సూచించారు.

సత్యదేవునికి ఘనంగా జన్మ నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి ఉత్సవమూర్తులు

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా బుధవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరిచి స్వామి, అమ్మవార్లకు అర్చక స్వాములు సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివ లింగానికి పండితులు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పళ్ల రసాలు పంచామృతాలతో మహాన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం సుగంధ భరిత పుష్పాలతో, స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అర్చకులు దత్తాత్రేయ శర్మ, సుధీర్, పవన్ ఈ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి యాగశాల లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఆయుష్య హోమం, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం సుమారు 20 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది.

నేడు నిజరూప దర్శనం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు, శంకరులు గురువారం ఏ విధమైన ఆభరణాలు ధరించకుండా (మూల విరాట్‌లుగా) నిజరూపులో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

చిన్నారులకు ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కాకినాడ సిటీ: జిల్లాలో 0–6 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులకు వెంటనే ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలని, ఆధార్ నంబర్ లేని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహార సేవలు నిలిపివేస్తామని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి, సీడీపీవోలు, పోస్టల్, సీఎస్సీ, ఆధార్, జీఎస్డబ్ల్యూఎస్ అధికారులతో ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ రిజిస్ట్రేషన్, ఆధార్ నమోదు క్యాంపుల నిర్వహణ ఇతర అంశాలపై కలెక్టర్ షణ్మోహన్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం పొందుతున్న 0–6 చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆధార్ చిన్నారులకు మే నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం నిలిపి వేయాలని కలెక్టర్ చెప్పారు. ఐసీడీఎస్ పీడీ కె విజయకుమారి, సీడీపీవోలు, పోస్టల్ ఆధార్ మేనేజర్ రాజ్‌కుమార్, సీఎస్‌ఈ ఆధార్ మేనేజర్ ఆదిత్య, జీఎస్డబ్ల్యూఎస్ ఆధార్ కోఆర్డినేట్ శంకర్ పాల్గొన్నారు.

సంపద సృష్టి.. రాబడి నష్టి!

- బోల్తా కొట్టిన 'బాబు' విజన్
- ప్రజలకు భారం...ఆదాయం ఘోరం
- నీరుగారిన సర్కార్ లక్ష్యాలు
- పడకేసిన రిజిస్ట్రేషన్‌లు
- స్పష్టం చేసిన మార్చి నివేదికలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు విజన్ రిజిస్ట్రేషన్ శాఖకు శాపమై కూర్చుంది. ఆర్థికంగా బలోపేతం చేస్తానంటూ భూముల విలువ అడ్డంగా పెంచేసి ప్రజల నెత్తిన భారం మోపారు. పోనీ భూముల విలువ పెంపుతో రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం ఏమైనా పెరిగిందా అంటే అదీ లేదు. రిజిస్ట్రేషన్‌లు పెరగడం మాట దేవుడెరుగు ఆదాయం అడ్డంగా పడిపోయింది. అనుకున్నదొక్కటి అయిన దొక్కటి మొత్తానికి మొదటికే మోసం వచ్చిందంటూ రిజిస్ట్రేషన్ శాఖ తల పట్టుకుంటోంది. భూముల విలువ పెంపుతో కాకినాడ జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుందని వేసుకున్న అంచనాలు తలకిందులయ్యాయి. జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించలేక చతికిలపడ్డాయి. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అయితే కనీసం 50 శాతం లక్ష్యాలను కూడా చేరుకోలేక వెనకపడ్డాయి. చంద్రబాబు సంపద సృష్టి అనే నినాదం మాటేమోకానీ తమకు గుదిబండగా మారిందని భూముల క్రయవిక్రయదారులకు గగ్గోలు పెడుతున్నారు. నిర్దేశించిన ఆర్థిక లక్ష్యాలు సాధించలేక యంత్రాంగం చేతులెత్తేయక తప్పింది కాదు. భూముల విలువ పెంపుతో భారమే తప్ప ఏ ఒక్కరికీ ఎటువంటి ప్రయోజనం కలగలేదని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వంలో భూముల ధరలు స్వల్పంగా పెంచింది. కూటమి గద్దె నెక్కాక భూమి విలువలను భారీగా పెంచడంతో గత ఆర్థిక సంవత్సరం కంటే తక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ప్రజలు భూములు కొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రభుత్వానికి చెల్లించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల వడ్డన భారీగా ఉండటంతో తక్కువ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్న పరిస్థితి కనిపించింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది 589 తక్కువ దస్తావేజులు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 91,946 రిజిస్ట్రేషన్‌లు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలో 91,357 రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి.

2023–14లో రిజిస్ట్రేషన్‌లు
91,946

2024–25లో రిజిస్ట్రేషన్‌లు
91,357

60 శాతం లక్ష్యాన్ని అధిగమించలేకపోయాయి

నిర్దేశించిన లక్ష్యం
రూ.615.32 కోట్లు

సాధించిన ఆదాయం
రూ.335.97 కోట్లు

అనుకున్నదొక్కటి అయినదొక్కటి

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. తొమ్మిది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏ ఒక్కటీ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించలేదు. మెజార్టీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు 50శాతం ఆదాయాన్ని కూడా చూడలేకపోయామంటున్నారు. జిల్లాలో భూ విలువల సవరణలతో చాలా ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ధరలు పెరిగాయి. ధరలు పెరగడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చునని సంబంధిత శాఖ అంచనా వేసుకుంది. లక్ష్యాలను అధిగమిస్తాయనుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెనుకబడటంతో శాఖ ఉన్నతాధికారులు లబోదిబోమంటున్నారు. ఆర్థిక సంవత్సరం మార్చి నెల ముగిసే సరికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా లెక్కలు తీసి చూస్తే చంద్రబాబు సంపద సృష్టి మాటేమో కానీ అనుకున్నదొకటి అయినదొక్కటి అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే చూస్తే భూముల విలువ భారీగా పెంచినా ఆ స్థాయిలో ఆదాయం నమోదు కాలేదంటున్నారు. క్రయ, విక్రయాలు తగ్గుముఖం పట్టడం చూసి స్థిరాస్తి రంగంలో విశేషమైన అనుభవం కలిగిన వారు మదనపడుతున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఇంతలా భారీగా భూ విలువలు పెంచకున్నా పిఠాపురం, సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్దేశించిన లక్ష్యాలను 70శాతం అధిగమించడం గమనార్హం.



కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

2023-2024 ఆర్థిక సంవత్సరంలో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం కోట్లలో	ఆదాయం కోట్లలో	శాతం	మొత్తం డాక్యుమెంట్లు
కాకినాడ (జిల్లా రిజిస్ట్రార్)	రూ.185.95	రూ.96.60	51.951	8,502
సర్పవరం	రూ.69.68	రూ. 48.67	69.86	5,735
పిఠాపురం	రూ. 46.38	రూ. 32.86	70.87	12,155
తుని	రూ.56.08	రూ.34.73	61.94	13,946
సామర్లకోట	రూ.48.37	రూ.35.66	73.73	10,622
పెద్దాపురం	రూ.36.64	రూ.21.84	59.60	6,001
ప్రత్తిపాడు	రూ.42.00	రూ.25.48	60.68	11,713
జగ్గంపేట	రూ.23.79	రూ.13.15	55.29	7,446
తాళ్లరేవు	రూ.35.35	రూ.20.93	59.21	7,446

2024-2025 ఆర్థిక సంవత్సరంలో..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం కోట్లలో..	ఆదాయం కోట్లలో..	శాతం	మొత్తం డాక్యుమెంట్లు
కాకినాడ (జిల్లా రిజిస్ట్రార్)	రూ.196.96	రూ.105.19	53.14	17,778
సర్పవరం	రూ.88.89	రూ. 49.71	55.92	5,263
పిఠాపురం	రూ. 57.65	రూ. 32.74	56.80	11,060
తుని	రూ.61.50	రూ.35.36	57.50	15.199
సామర్లకోట	రూ.62.29	రూ.33.42	53.66	10,439
పెద్దాపురం	రూ.39.87	రూ.18.44	46.26	5,076
ప్రత్తిపాడు	రూ.45.51	రూ.23.43	51.48	10,447
జగ్గంపేట	రూ.25.80	రూ.14.98	58.07	5,987
తాళ్లరేవు	రూ.36.82	రూ.21.69	58.90	10,108

లక్ష్యానికి దూరంగా..

2024–25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయాన్ని చూస్తే ఏ ఒక్క సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 60 శాతం లక్ష్యాన్ని కూడా అధిగమించలేక చతికిలపడ్డాయి. భూముల విలువను అడ్డంగా పెంచేసిన చంద్రబాబు ప్రభుత్వం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖకు నిర్దేశించిన లక్ష్యంగా రూ.615.32 కోట్లు. వచ్చిన ఆదాయం చూస్తే రూ.335.97 కోట్లు మాత్రమే నమోదైంది. 54.44 శాతం ఆదాయాన్ని మాత్రమే జిల్లాలో సంబంధిత శాఖ రాబట్టగలిగింది. అదే 2023–24 ఆర్థిక సంవత్సరంలో చూసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం రూ. 544.27 కోట్లు. వచ్చిన ఆదాయం రూ.329.97 కోట్లు నమోదైంది. అప్పట్లో ఆదాయ వృద్ధి 60.63 శాతంగా నమోదైంది.

ప్రభుత్వం భూమి విలువలు పెంచినప్పటికీ జిల్లాలో ఉన్న తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆదాయ పరంగా బాగా వెనుకబడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా పెద్దాపురం నిలిచింది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రూ.39.87 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటే రూ.18.44 కోట్లతో కేవలం 46.26 శాతానికే పరిమితమవ్వడంతో ఆశ్చర్యపోవడం ఆ కార్యాలయ ఉద్యోగుల వంతైంది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో కేవలం 5,076 లావాదేవీలు మాత్రమే జరగడం గమనార్హం. కొద్దిగా అటు ఇటుగా మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి. చంద్రబాబు ప్రభుత్వం సంపద సృష్టి అంటూ ప్రజలపై భారం మోపడం తప్ప రిజిస్ట్రేషన్‌లలో ఏమాత్రం వృద్ధి సాధించలేదని సంబంధితశాఖ ఉద్యోగులు విశ్లేషిస్తున్నారు.

పెట్రో ధరలపై సీపీఎం ధర్నా




కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అత్యంత దారుణంగా భారాలు వేస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్ సుంకాల పేరుతో గ్యాస్‌పై నేరుగా రూ.50 పెంచారన్నారు. దీనివల్ల నిత్యావసర సరకుల ధరలు పెరిగి పరోక్షంగా ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. ఒకపక్క దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి మతాల మధ్య చిచ్చు పెట్టి మరిన్ని ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మోదీ అధికారంలోకి వచ్చే ముందు వచ్చేది అచ్చేదిన్ అన్న విషయాన్ని ప్రస్తావించారని ఎవరికి అచ్చేదిన్ అని ఆనాడే సీపీఎం ప్రశ్నించిందన్నారు. సామాన్య మధ్య తరగతి కుటుంబాలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు సంపద పెంచడమే బీజేపీ, మోదీ విధానాలని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా మనదేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం విడ్డూరంగా ఉందని ఆందోళనకారులు అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతిస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజల పక్షాన నిలబడాలన్నారు. గాడిమొగ గ్యాస్ ఉమ్మడి జిల్లా వాసులకు రూ.100కే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, జి.భూలక్ష్మి, టి.రాణి, ఆర్.తలుపులమ్మ, పోలితల్లి, కె.సత్తిబాబు, వి.కుమార్‌స్వామి, టి.వీరబాబు, రాజు, నరేంద్ర, శివ పాల్గొన్నారు.

ఆచారాలను 'గంట' కలిపేశారు

- చేబ్రోలులో రాముడి సాక్షిగా జనసేన వర్గాల కొట్లాట
- ఆలయంలో జేగంట కొట్టే ఆచారానికి అపచారం





ఆలయంలో వివాదానికి దిగిన జనసేనకు చెందిన రెండు వర్గాలు, జే గంట

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను వివాదాలకు వేదికగా జనసేన నేతలు మార్చేశారు. ఉత్సవాల సందర్భంగా రోజూ స్వామి వారికి వాహన సేవ నిర్వహిస్తుంటారు. వాహనాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించే సమయంలో గుడిలో జేగంట మోగిస్తుంటారు. గ్రామంలో ఒక కుటుంబీకులు జేగంట కొట్టడం ఆచారంగా వస్తోంది. కొంతకాలంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లే గుడిలో గంట కొట్టాలనే కొత్త ఆచారానికి నాంది పలికారు. ఈ నేపథ్యంలో గంట కొట్టే విషయంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న జనసేన నేతల మధ్య వర్గ విభేదాలు తలెత్తాయి. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మూడు రోజులుగా వాహన సేవలు నిర్వహిస్తున్నారు. రోజూ రెండు వర్గాలు తామంటే తామంటూ బాహాబాహీలకు దిగుతున్నారు. మంగళవారం రాత్రి హనుమంత వాహన సేవ నిర్వహించే సమయంలో రెండు వర్గాలు కొట్లాటకు దిగడంతో పోలీసులు వారిని తప్పించి ఆలయ అర్చకుడితో జేగంట మోగించి వాహన సేవను నిర్వహించారు. చివరి రోజు రథోత్సవం తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పోలీసులు జనసేన నేతలకు హెచ్చరికలు జారీ చేశారు.

ఇన్‌చార్జి చెప్పినా..

గంట కొట్టే విషయంలో జనసేనకు చెందిన రెండు వర్గాలు ఆలయానికి చేరుకుని పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌ను ఈ విషయమై నిలదీశారు. తాము ఎన్నికల్లో కష్టించి పనిచేశామని, తమకు అవకాశం ఇవ్వకుండా వేరే వర్గానికి అవకాశం ఇస్తారా అంటూ ఒక వర్గం. వారు ఇటీవలే పార్టీలోకి వచ్చారు పార్టీ పెట్టినప్పటి నుంచి మేము జనసేనకు మద్దతుగా పని చేస్తున్నాం.. మాకే అవకాశం ఇవ్వాలని మరో వర్గం పట్టుబట్టారు. వివాదాలు లేకుండా ఆలయ ఆచారాలను నిర్వహించాలని ఇన్‌చార్జ్ చెప్పినప్పటికి లెక్క చేయని రెండు వర్గాలు వాగ్వాదాలకు దిగడంతో ఆలయంలో ఉత్సవ వేళ గందరగోళంగా మారింది. కాగా ఆలయంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న జేగంట స్థానంలో జనసేన నేతలు కొత్త గంటను తెచ్చి పెట్టడం విమర్శలకు దారితీసింది. ఉన్నతాధికారులు కలగజేసుకుని శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తమ్ముళ్ల గుస్సా

- ప్రజాదర్బార్ సాక్షిగా బయటపడ్డ టీడీపీ, జనసేన విభేదాలు
- టీడీపీ నాయకులు, కార్యకర్తల నిరసనలు



ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీ సతీష్‌కుమార్ తదితరులు

కాకినాడ సిటీ: టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఉన్న రాజకీయ విభేదాలు టీడీపీ ప్రజాదర్బార్ కార్యక్రమంలో బయటపడ్డాయి. బుధవారం కాకినాడ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయం ముందు కార్యకర్తలు, కొందరు నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ అరుపులు, కేకలతో దర్బార్‌ను దద్దరిల్లింపజేశారు. ప్రజాదర్బార్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలంటూ పట్టుబట్టారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ప్రతి బుధవారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన వివాదాస్పదం అయిన అంశంపై ప్రధానంగా చర్చించారు. నాగబాబుకు వర్మ ఘాటైన సమాధానం ఇచ్చారని, పార్టీ నాయకులు, కార్యకర్తలపై జనసేన నాయకులు కేసులు పెట్టేందుకు ప్రయత్నించడం వంటి విషయాలను ప్రజాదర్బార్‌లో ప్రధానంగా చర్చించారు. టీడీపీ నాయకులకు ఆహ్వానం లేకపోవడం, కేవలం జనసేన పార్టీ నాయకులే అంతా తామై వ్యవహరించిన తీరుపై దర్బార్‌లో నాయకులు మల్లగుల్లాలు పడ్డారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు కొందరు బయట పడకుండానే పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ఎలా తిప్పికొట్టాలనే అంశాలపై ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు కూడా చర్చలు జరిగినట్లు సమాచారం.

ఆశ్చర్య పరచిన వర్మ కామెంట్లు

ఈ ప్రజాదర్బార్‌లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేశాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పర్యటన వల్ల టీడీపీకి జరిగిన నష్టం, తనకు ఎమ్మెల్సీ పదవి రాలేదనే అంశాలను దృష్టిలో పెట్టుకొని వర్మ చేసిన కామెంట్లు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. వర్మ మాట్లాడుతూ టీడీపీ 2047 ప్రణాళిక కావాలని, టీడీపీ రథసారధిగా మంత్రి లోకేశ్‌ను ప్రకటించాలన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ఎంపీ సానా సతీష్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల్లో అసహనం ఉందని తెలిసి ప్రజాదర్బార్ చేపట్టామన్నారు. కార్యకర్తలను సమన్వయం చేస్తానని ప్రకటించారు. ప్రజాదర్బార్‌లో జనసేన పార్టీ అధికారంలో ఉన్న నియోజకవర్గాలపైనే చర్చ కొనసాగడం విశేషం. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ నాయకులు చిక్కాల రామచంద్రరావు, పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌తో ఉపయోగం

నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

కాకినాడ రూరల్: విద్యార్థి దశలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు వాళ్లలోని నైపుణ్యాలను వెలికి తీయడానికి, సమాజంలో ఎదుర్కోబోయే వివిధ సవాళ్లను నేర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్, కామర్స్, మేనేజ్‌మెంట్ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో తలాష్–2కె25 పేరుతో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతిశ్రీ అధ్యక్షత వహించగా, కార్యక్రమానికి ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌గా విభాగాధిపతి డాక్టర్ డి.అజయ్ రతన్ నేతృత్వం వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రబాల్‌సేన్ గుప్త మాట్లాడుతూ ఇలాంటి అనుభవాలు ఉద్యోగ అవకాశాల్లో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తలాష్ అనే ఒక మంచి టైటిల్‌ను దీనికి అందించిన విభాగాన్ని అభినందించారు. మరో విశిష్ట అతిథి ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.సునీల్‌కుమార్ బహుమతులు విద్యార్థులకు అందించారు. వివిధ క్యాంపస్‌లు, కాలేజీల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విభాగాధిపతి డాక్టర్ డి.అజయ్ రతన్ మాట్లాడుతూ, 'విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బిజినెస్ దృక్పథం, సమస్య పరిష్కరణ నైపుణ్యాలు, బృందపనుల అవగాహన కలిగించేలా ఈ ఫెస్ట్‌ని రూపొందించామన్నారు. డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ మధు కుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమా రజిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్.సూరవరం కార్యదర్శి సస్పెన్షన్

తుని రూరల్: విధి నిర్వహణలో **నిర్లక్ష్యం**, వసూలు చేసిన ఆస్తి పన్నులను సబ్ **ట్రెజరీలో** జమ చేయకపోవడంపై క్రమశిక్షణ **చర్యల్లో** భాగంగా తుని మండలం ఎన్.సూరవ**రం పం**చాయతీ గ్రేడ్–3 కార్యదర్శి కె.వెంకటల**క్ష్మి సస్పెం**డ్ అయ్యారు. దీనిపై ఈ నెల ఏడో తేదీన కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు బుధవారం ఈఓపీఆర్డీ జి.మరిడియ్య తెలిపారు. టి.తిమ్మాపురం, తేటగుంట గ్రామాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ, ఇటీవల ఎస్.సూరవరానికి వెంకటలక్ష్మి బదిలీపై వచ్చారు. ఆ రెండు గ్రామాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పన్నులు వసూలు చేసేందుకు డిమాండ్ నోటీసులు ఇవ్వకపోవడం, వసూలు చేసిన మొత్తంలో కొంత సొమ్ము సబ్ ట్రెజరీకి జమ చేయలేనట్టు ఆమెపై ఉన్నత అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో తుని ఎంపీడీఓ, పెద్దాపురం డీఎల్‌పీఓలు వేర్వేరుగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. దాన్ని సమగ్రంగా పరిశీలించిన ఉన్నత అధికారులు కార్యదర్శి వెంకటలక్ష్మిని సస్పెండ్ చేశారు.

హాకీ టోర్నీ విజేత 'కాకినాడ'



ట్రోఫీని అందుకుంటున్న కాకినాడ జట్టు

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ టోర్నీ విజేతగా కాకినాడ జిల్లా జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జట్టుపై 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్.. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని అందజేశారు.


లారీ ఢీకొని వ్యక్తి మృతి



ధవళేశ్వరం: వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో మోటారు సైకిలిస్టు మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజానగరం మండలం యర్రంపాలేనికి చెందిన నేటి శ్రీను (50) ఈ నెల 4వ తేదీన తణుకు మండలం వేల్పూరులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై ప్రయాణమయ్యాడు. ఉదయం 10 గంటల సమయంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలైన శ్రీనును రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏమీ బాగోలేదు స్వామీ..

- రత్నగిరి సేవలపై భక్తుల అసంతృప్తి
- అభిప్రాయ సేకరణలో వెల్లడి
- వరుసగా మూడో నెలా అదే ఫలితం
- కనిపించని మెరుగుదల



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం.. భక్తులకు అందిస్తున్న సేవలకు సంబంధించి మూడో నెల అభిప్రాయ సేకరణలో కూడా మెరుగుదల కనిపించలేదు. గత ఫిబ్రవరిలో చిట్టచివరి ఏడో ర్యాంకు, మార్చిలో రెండో ర్యాంకు సాధించినా అసంతృప్తి అలాగే ఉంది. తాజాగా ఏప్రిల్ నాలుగో తేదీన విడుదల చేసిన గణాంకాల ప్రకారం భక్తుల అసంతృప్తి ఇంకా పెరిగినట్టు తెలుస్తోంది.

అభిప్రాయాల సేకరణ

దేవస్థానాల్లో అందే సేవలు, ప్రసాదం నాణ్యత, ఇతర ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ యాప్, ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంది. వాటిని ప్రామాణికంగా తీసుకుని తాజా ర్యాంకులు ప్రకటించింది. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి, ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల, విజయవాడలోని కనకదుర్గమ్మ గుడి, సింహాచలం వరాహ నృశింహస్వామి, శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానాలకు సంబంధించి మార్చి 20 – ఏప్రిల్ నాలుగో తేదీల మధ్య సేకరించిన అభిప్రాయాల ప్రకారం మంగళవారం ర్యాంకులు విడుదల చేసింది.

దర్శనంలో రెండు

సత్యదేవుని దర్శనం మీరు అనుకున్న సమయంలో జరిగిందా అనే ప్రశ్నకు 69 శాతం మంది భక్తులు అవునని సమాధానం చెప్పగా, 31 శాతం మంది కాలేదన్నారు. సింహాచలం, శ్రీకాళహస్తి దేవస్థానాలకు కూడా ఇదే విధంగా రెండో ర్యాంకు వచ్చింది.

మౌలిక వసతుల్లో ఆరు

దేవస్థానంలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, వాష్ రూమ్స్, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలు, చెప్పులు భద్రపరిచే చోటు, తదితర విషయాలపై 60 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. 40 శాతం మందికి మాత్రం నచ్చలేదు. ఈ విభాగంలో అన్నవరానికి ఆరో ర్యాంకు వచ్చింది.

ప్రసాదానికి రెండు

సత్యదేవుని ప్రసాదం రుచి, నాణ్యత విషయాలలో 80 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 20 మంది అసంతృప్తి చెందారు. దీనిలో రెండో ర్యాంకు వచ్చింది.

పెరిగిన అసంతృప్తి

గతంలో జరిగిన అభిప్రాయ సేకరణలో స్వామివారి దర్శనంపై 70 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, ఈసారి అది 69 శాతానికి పడిపోయింది. మౌలిక వసతుల విషయంలో గతంలో 65 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా, ఈసారి 60 శాతం మంది మాత్రమే బాగున్నాయన్నారు. ప్రసాదం రుచి, నాణ్యతపై గతంలో 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా ఈసారి 80 శాతానికి పరిమితమైంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,500
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వైభవంగా పొన్నవాహన మహోత్సవం



పొన్నవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కొత్తపేట: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పొన్న వాహన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవదాయ, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఈ కార్యక్రమం జరిపారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం తెల్లవారుజామున స్వామివారి మేలుకొలుపు, గౌతమి నది నుం**చి తీర్థపు** బిందెను తీసుకువచ్చి విశేషార్చన, **నిత్య** హోమాలు నిర్వహించారు. రాత్రి ఉభయ **దేవేరు**లతో స్వామివారు పొన్నవాహనంపై **గ్రామంలో** విహరించారు. ఈ సందర్భంగా ఆలయ **ఆవర**ణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్య**క్రమాలు** అలరించాయి. పశ్చిమగోదావరి జిల్లా **తణుకు** మండలం సజ్జాపురానికి చెందిన నందగోపాల మహిళల కోలాట భజన మండలి కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

బంగారం కోసం అమ్మమ్మ కళ్లలో కారం

- ఓ మనవరాలి నిర్వాకం
- సహకరించిన ఆమె మైనర్ కుమార్తె
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కాకినాడ రూరల్: బంగారు గాజుల కోసం అమ్మమ్మ కంట్లో కారం కొట్టిందో మనవరాలు. విచారణకు వచ్చిన పోలీసులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసి చివరకు కటకటాల పాలైంది. వివరాల్లోకి వెళితే.. ఇంద్రపాలెంలోని అర్జున్ నగర్‌లో 72 ఏళ్ల మండా హైమావతి ఒంటరిగా అద్దెకు ఉంటోంది. ఆమె ఇంట్లోకి ఈ నెల 6వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో దొంగలు చొరబడ్డారు. హైమావతి కళ్లలో కారం కొట్టి రెండు బంగారు గాజులను కాజేశారు. అసలే కళ్లు సరిగ్గా కనిపించని హైమావతి ఆ దొంగలను గుర్తు పట్టలేకపోయింది. చోరీ విషయంపై సమాచారం అందుకున్న ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, సిబ్బంది విచారణ చేపట్టారు. కాకినాడలో వేరే ప్రాంతంలో ఉంటున్న హైమావతి మనవరాలు చెల్లూరు దుర్గాభవాని పోలీసులకు సహకరిస్తూ, వారి చుట్టూ తిరిగింది. చివరకు దుర్గాభవాని, ఆమె కుమార్తె (మైనర్) ఈ దొంగతనానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం నిందితులను అరెస్టు చేసి, బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు, మైనర్ నిందితురాలిని విశాఖపట్నం బాలికల వసతి గృహానికి పంపినట్టు ఎస్సై వీరబాబు తెలిపారు.



భారత్‌తో కలిసి సంయుక్త విన్యాసాల్లో పాల్గొన్న అమెరికా సైన్యం

కాకినాడ తీరం.. కదన రంగం

- ఉత్సాహంగా టైగర్ ట్రయంఫ్ విన్యాసాలు
- పాల్గొన్న భారత్, అమెరికా సైనికులు

కాకినాడ రూరల్: కాకినాడ తీరం కదన రంగాన్ని తలపిస్తోంది. శత్రు దేశాలకు వణుకు పుట్టేలా భారత, అమెరికా దేశాల సైన్యాలు తమ విన్యాసాలను ప్రదర్శిస్తున్నాయి. క్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేలా.. అంకిత భావంతో ఇరు దేశాల సైన్యం ఐక్యతను ప్రదర్శిస్తూ పరస్పర సహకారం, రక్షణ సామర్థ్యం పెంపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. భారత్, అమెరికా దేశాల సైన్యం చేపడుతున్న టైగర్ ట్రయంఫ్ – 25 సంయుక్త విన్యాసాలు ఈ నెల ఒకటిన విశాఖలో ప్రారంభమవ్వగా కాకినాడలో 12న ముగియనున్నాయి. కాకినాడ తీరంలోని నావల్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలోనూ, సాగర తీరంలోనూ నాలుగు రోజుల పాటు విన్యాసాలు చేపడుతున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్), ఇండియన్ నేవీ, యునైటెడ్ స్టేట్స్ ఎయిర్ ఫోర్స్ (యూఎస్ఏఎఫ్) బుధవారం ఫ్లయింగ్ మిషన్‌ను నిర్వహించాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సి – 130 హెర్క్యులస్ ఎయిర్ క్రాఫ్ట్, భారత నావికాదళానికి చెందిన హాక్స్, యూఎస్ఏఎఫ్‌కి చెందిన సి – 130 సంయుక్త విన్యాసాలలో పాల్గొన్నాయి. అలాగే ఐఎన్ఎస్ జలాశ్వ, యుఎస్ఎస్ కామ్‌స్టాక్ యుద్ధ నౌకలతో తీరంలో విన్యాసాలు ప్రదర్శించారు.





కాకినాడ వద్ద సముద్రంలో యుద్ధ నౌకలు, గాలిలో యుద్ధ విమానాల విన్యాసాలు

బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కాలేజీ మైదానంలో బుధవారం నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృపారావు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. వీటికి జిల్లా నలుమూలల నుంచి 25 మంది హాజరుకాగా, 8 మంది మహిళలు, ఇద్దరు పురుషులను ఎంపిక చేశామన్నారు. వీరందరూ ఈ నెల 12, 13వ తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ యూత్ మెన్ అండ్ వుమెన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న యువకుడి అరెస్టు



నిందితుడు దుర్గారావును చూపిస్తున్న రైల్వే పోలీసులు

నిడదవోలు: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిడదవోలు మండలం సింగవరం గ్రామానికి చెందిన ఉలవలపూడి దుర్గారావును బుధవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. భీమవరం రైల్వే సీఐ ఎస్.సోమరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉలవలపూడి దుర్గారావు కొంత కాలంగా రైళ్లలో ప్రయాణికుల బంగారు ఆభరణాలను దొంగిలిస్తున్నాడు. అలాగే రైలు ఫుట్‌బోర్డుల దగ్గర నిలబడి ఫోన్ మాట్లాడుతున్న ప్రయాణికులను కర్రతో కొట్టి, ఆ ఫోన్లు కిందపడగానే వాటిని తీసుకుని ఉడాయిస్తాడు. ఇలా అతడు దోచుకున్న 18 సెల్‌ఫోన్లు, 30 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసున్నారు. వాటి విలువ సుమారు రూ. 3.70 లక్షలు ఉంటుందని రైల్వే సీఐ తెలిపారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

నల్లజర్ల: మండలంలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులను లైంగికంగా వేధించిన ఓ వృద్ధుడి (హెచ్ఐవీ రోగి)పై పోలీసులు పోక్సో కేసు కట్టారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చిన్నతనం నుంచే చోరీల బాట

- అంతర్ జిల్లా దొంగ అరెస్టు
- రూ.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చిన్నతనం నుంచే చోరీల బాట పట్టిన దొంగను నిడదవోలు పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.50 లక్షల విలువైన 630 గ్రాముల బంగారం, రూ.3.60 లక్షల విలువైన 4 కేజీల వెండి, లక్ష రూపాయల నగదు, టీవీ, మోటారుసైకిల్, ఐరన్ రాడ్డు, స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం సమీపంలోని గునుపూడి బ్రాహ్మణవీధిలో నివాసముండే పందిరి వెంకట నారాయణ ఆలియాస్ నారిగాడు చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. 2008లో భీమవరం చుట్టుపక్కల ప్రాంతంలో సైకిళ్లు, ఇనుపముక్కలు దొంగతనం చేసేవాడు. దీంతో పోలీసులు వెంకట నారాయణను పట్టుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఆ తర్వాత పలు చోరీలకు పాల్పడ్డాడు. అతడిని పోలీసులు అరెస్టు చేయడం, బయటకు రావడం, మళ్లీ దొంగతనం చేయడం, తిరిగి జువైనల్ హోమ్‌కు వెళ్లడం పరిపాటిగా మారింది. అలా అమలాపురం, పి.గన్నవరం, వీరవాసరం, ఆచంట, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర ప్రాంతాల్లో చోరీలు చేశాడు. చివరిసారిగా గత ఏడాది అక్టోబర్ 22న ఆలమూరు పోలీసులు అరెస్టు చేసి తిరిగి జైలుకు పంపారు. నెల తర్వాత బెయిల్‌పై విడుదలైన వెంకట నారాయణ సమిశ్రగూడెం, ఉండ్రాజవరం, పెనుమంట్ర, ఐనవల్లి, పెరవలి, రావులపాలెం, భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిల్లో మరో నేరస్తుడు శివసుబ్రహ్మణ్యంతో కలిసి నేరాలు చేశాడు. ఇదిలా ఉండగా.. వెంకట నారాయణ ఉండ్రాజవరంలోని సీపాని విజయలక్ష్మి ఇంటి తాళాలు పగులకొట్టి విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కదలికలపై కన్నువేసి చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిపై గతంలో 57 కేసులున్నట్టు గుర్తించారు. కేసును చేధించిన నిడదవోలు సీఐ స్వరూప్, ఉండ్రాజవరం ఎస్సై జి.శ్రీనివాసరావు, సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు, సీసీఎస్ ఎస్సై రవీంద్ర, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ డి.నరసింహ కిశోర్, క్రైం అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల తొలగింపు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానంలో భద్రతా విధుల్లో ఉన్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగించారు. వారిని మంగళవారం అర్ధరాత్రి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం తాగి విధులకు వచ్చినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో మాక్స్ కంపెనీ వారిద్దరినీ విధుల నుంచి తొలగించింది. అలాగే దేవస్థానం ఘాట్‌రోడ్ టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి కారులో మద్యం సీసా కలిగి ఉండడంతో అతడిని వెనక్కి పంపించేశారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

రాజానగరం: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇన్‌చార్జి సీఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శాటిలైట్ సిటీకి చెందిన నల్లమంతి సుధీర్ (23) బైకుపై బుధవారం నామవరం వైపు వెళుతున్నాడు. అతడిని ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

270 కేజీల గంజాయి స్వాధీనం

- కంటైనర్‌లో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గంజాయి విలువ రూ.13.50 లక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడి చేశారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ బుధవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన సందీప్‌శర్మ, అదే రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ మోనుసైని ఏజెన్సీ ప్రాంతం నుంచి 270 కేజీల గంజాయిని కంటైనర్‌లో లోడ్ చేసుకుని బయలుదేరారు. దీనిపై ముందస్తు సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీసులు, ఈగల్ టీం సభ్యులు ఆ లారీ వచ్చే ప్రాంతంలో కాపు కాశారు. ఎన్ఎల్ 01 ఏజే 6162 కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో లారీ డ్రైవర్ మోనుసైని పోలీసులకు చిక్కగా, మరో నిందితుడు సందీప్ శర్మ పారిపోయాడు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.13.50 లక్షలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. లారీడ్రైవర్‌ను పోలీసులు కోర్టులో హాజరుపర్చగా, అతడిపై తదుపరి చర్యల కోసం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపారు. గంజాయిని తరలిస్తున్న రూ.30 లక్షల విలువైన కంటైనర్‌ను సీజ్ చేశారు. కాగా.. గంజాయిని పట్టుకున్న బొమ్మూరు సీఐ పి.కాశీ విశ్వనాథంతో పాటుఈగల్ టీం, పోలీసు సిబ్బందిని ఎస్పీ నరసింహ కిశోర్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, నిందితుడితో ఎస్పీ నరసింహ కిశోర్